## సంపాదకీయం

# అన్నదాత నడ్డి విరిచిన ప్రకృతి

అనావృష్టితో ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయి. సకాలంలో వర్షాలు రానందున మూడో వంతు భూమిని విత్తకుండా, నాటకుండా వదిలేస్తారు. విత్తిన పంటలు వర్షాభావానికి గురయ్యాయి. కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 971 మండలాలు అనావృష్టికి గురైనట్లుగా ప్రకటించింది.

ఆగస్టు మూడో వారం నుంచి ప్రారంభమైన జల్లులకు ఆలస్యమైనా కొంత దిగుబడినైనా సాధించవచ్చనే ఆశతో వృధాగా ఉన్న కొన్ని భూముల్లో రైతులు విత్తారు. మిగతావారు రబీ పంటల సాగుకు తయారవుతున్న పరిస్థితుల్లో అక్టోబరు మొదటివారంలో కర్నూలు, కృష్ణా, గుంటూరు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని నదులకు, కాలువలకు దగ్గరలోనున్న పలు గ్రామాలు, పంటలు పైనుంచి వచ్చిన వరదనీటి వల్ల ముంపుకు గురయ్యాయి. కృష్ణా, గుంటూరు జిల్లాలలో లంక గ్రామాలు నీటిలో మునిగాయి. కర్నూలు పట్టణంలో సుమారు 25 అడుగుల ఎత్తున కొన్ని ప్రాంతాల్లో ఇసుక, నల్లమట్టి చేరాయి. పంట భూముల్లో ఇసుక మేటలు వేశాయి.

కొన్నిచోట్ల పశువులు, గడ్డివాములు కొట్టుకుపోయాయి. రహదార్లు దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటలు, కాలువలకు గండ్లు పడ్డాయి. విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. ఖరీఫ్‌లో విత్తిన పంటలు ఆలస్యంగా వచ్చిన వర్షాలతో తిరిగి కోల్కొంటున్న సమయంలో అకస్మాత్తుగా వచ్చిన వరదలతో అవి కూడా ముంపుకు గురయ్యాయి.

ప్రతికూల వాతావరణ పరిస్థితుల మూలంగా పంటల ఉత్పత్తులు, దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుత తాత్కాలిక అంచనా ప్రకారం వడ్లు 4.64 లక్షల టన్నులు, కందులు 10 వేల టన్నులు, నూనెగింజలు 1.30 లక్షల టన్నుల వరకు దిగుబడులు తగ్గవచ్చని భావిస్తున్నారు.

మొత్తంమీద కరవు కోరల్లో చిక్కుకున్న రైతాంగాన్ని వరద మరింత నష్టపర్చడం గోరుచుట్టుపై రోకలి పోటులా తయారయింది.

ఖరీఫ్‌లో మొదట తీవ్ర వర్షాభారం వల్ల 15 లక్షల హెక్టార్లలో విత్తనాలు వేయలేదు. ఆ తర్వాత వరదల మూలంగా దాదాపు 16.50 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 47.5 లక్షల హెక్టార్లలో పైర్లు విత్తారు. దాదాపు 32 లక్షల హెక్టార్లలో భూమి నిరుపయోగమైనట్లు తేలింది. నూనెగింజల సాగు కూడా సుమారు 6 లక్షల హెక్టార్లు తగ్గింది.

ఖరీఫ్‌లో విపరీతమైన నష్టాలు చవిచూసిన రాష్ట్ర రైతాంగం రబీపంటల సాగుకు సిద్ధం కావాలి. వరదలకు గురైన భూముల్లో మేటవేసిన సిల్ట్ ఇసుక మొదలైన వాటిని తీసివేయడం ఖర్చు, కాలంతో కూడుకున్న సమస్య.

ఆ ప్రాంత వాతావరణ పరిస్థితులు, భూమి తీరు, నీటితడి లభ్యత మొదలైన వాటిని దృష్టిలో పెట్టుకొని అనువైన లాభసాటి పంటలను సూచించడం అవసరం. ఆ పంటలకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, సస్యరక్షణ మందులు వగైరాలన్నీ సులభంగా సరసమైన ధరలకు లభించే ఏర్పాట్లు చేయాలి. లేనిఎడల కల్తీ విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులతో రైతాంగం నష్టాలపాలయ్యే అవకాశముంది.

వెంటనే ఉపయోగపడుటకు, ఆదాయం పొందుటకు స్వల్పకాలిక పంటల సాగు మేలు. కూరగాయలు, అపరాల సాగు, పశుగ్రాసాలనిచ్చే స్వల్పకాలిక పంటలైన మొక్కజొన్న, జొన్న టియోసింట్, సజ్జ, జనుము, పిల్లిపెసర మొదలైన పైర్లను సాగుచేసి తమ పశుగణ పోషణకు, మిగిలింది అమ్ముకోవడం ద్వారా కొంత ఆదాయం పొందవచ్చు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సంవత్సరం ప్రధానమైన ఆహార ధాన్యపు పంటలు, నూనెగింజల పంటలతో సహా పలురకాల పంటల ఉత్పత్తులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఆహారధాన్యాల ధరలు ఇప్పుడే పెరిగాయి. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశముంది.

రబీ పంటల్లో వీలైనంతవరకు రైతులకు లాభసాటిగా ఉండేలా అధిక ఉత్పత్తులను పొందుటకు తోడ్పడటం అవసరం. ప్రభుత్వపరంగా విత్తనాలు, సాగునీటి లభ్యత, విద్యుత్ సరఫరా, డీజిల్ ఆయిల్ సులభంగా, సరసమైన ధరకు లభించే ఏర్పాట్లు చేయాలి. పంట భూములను నవంబరు మాసం నుంచి ఫిబ్రవరి వరకు తరచుగా దర్శించి, తగిన సలహాలిచ్చే విస్తరణ కార్యక్రమాలను ముమ్మరం చేసి రైతాంగానికి తోడ్పడటం అత్యవసరం. ఈ సలహాలు, సూచనల మూలంగా ప్రభుత్వ శాఖల్లోని సిబ్బంది, రైతాంగం మధ్య సత్సంబంధాలు, అన్యోన్యత ఏర్పడతాయి.

వరద ప్రాంతాల్లో పశువులు, గొర్రెలు, మేకలు, పలురకాల అంటువ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఆ వ్యాధులు ప్రబలకుండా ముందుగా వ్యాధినివారణ టీకాలు వేయించడం, దూడలకు నట్టల నివారణ మందులివ్వడం మొదలైన వ్యాధుల నివారణ చర్యలు చేపట్టడం ఉత్తమం.

కాలయాపన జరగకుండా ఈ కార్యక్రమాలన్నీ నవంబరు రెండో వారంలోగా పూర్తిచేయడం మేలు.

